క్లుప్తంగా

ఊరేగింపుగా చీమలపాడుకు గంధం



జుజ్జూరు(వీరులపాడు): చీమలపాడు గ్రామంలోని హజరత్‌బాబా బుఖారి హతవుల్లా షరీఫ్ బాబా గంధ మహోత్సవానికి జుజ్జూరు గ్రామం నుంచి శుక్రవారం గంధాన్ని పంపించారు. తొలుత గ్రామంలో గంధానికి ఊరేగింపు నిర్వహించారు. మసీదులో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ చీమలపాడులో జరిగే గంధం మహోత్సవాలకు గ్రామం నుంచి బాబా వంశస్తులు గంధం పంపటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఊరేగింపుగా తీసుకెళ్లి చీమలపాడులోని పీఠాధిపతి ఖాజామొహిద్దీన్‌కు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో షేక్ ఖాజా అనిఫ్, మస్తాన్, షేక్ లాల్ అహ్మద్‌గౌస్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన



గరికపాడు(జగ్గయ్యపేట): రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ అచ్యుతరాజు సూచించారు. సమగ్ర పోషక యాజమాన్యం శిక్షణలో భాగంగా సేంద్రియ ఎరువుల వినియోగంపై పీఏసీఎస్‌ల సిబ్బందికి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎరువులు సమగ్ర పోషక యాజమాన్యంపై సొసైటీల సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సేంద్రియ ఎరువులతో పాటు రసాయన ఎరువులు నేలలు వాటి స్వభావం వంటివి వివరించాలని సూచించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శివప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణంరాజు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సొసైటీల సిబ్బంది, కంచికచర్ల, నందిగామ, మైలవరం, తిరువూరు సొసైటీల సిబ్బందిపాల్గొన్నారు. పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



ముక్త్యాల(జగ్గయ్యపేట): ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలను అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈవో చిట్టిబాబు సూచించారు. ముక్త్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిర్దిష్ట ప్రణాళికతో పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. అనంతరం కెఅగ్రహారం మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి



జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయా ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.సరైన పత్రాలులేని ద్విచక్రవాహనాలకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు లైసెన్స్, వాహనాల పత్రాలను అన్నింటిని వాహనంలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సైలెన్సర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడల్లో జెడ్పీ బాలికల ప్రతిభ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మైలవరం నియోజకవర్గం స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో మూలపాడు జెడ్పీ పాఠశాల బాలికలు ఉత్తమ ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం డేవిడ్‌రాక్‌ఫెల్లర్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి పాఠశాలలో శుక్రవారం జరిగిన అండర్ 14 విభాగం యోగా పోటీల్లో జె.దుర్గాభవానీ, బి. ప్రియాంక ప్రథమ, ద్వితీయ స్థానాలు, అండర్ 17 షటిల్ పోటీల్లో వి.మేఘన ప్రథమ, ఎస్.జస్వంతి ద్వితీయ స్థానాలు, అండర్ 17 కబడ్డీలో శ్రీవల్లి, స్వాతి, అక్షిత ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికలను హెచ్ఎం డేవిడ్ ఫెల్లర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిలిచిన ఎత్తిపోతల పథకం

- వరదలకు దెబ్బతిన్న పంపులు , ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇబ్బందుల్లో ఆయకట్టు చివరిభూముల రైతులు
- మరమ్మతులకు రూ.10లక్షలు అంచనా



వరదల కారణంగా మరమ్మతులకు గురైన పెనుగంచిప్రోలు ఎత్తిపోతల పథకం

పెనుగంచిప్రోలు: గతనెలలో సంభవించిన భారీ వరదలకు మునేరుపై శింగవరం రోడ్డులో నిర్మించిన ఎత్తిపోతల పథకం దెబ్బతింది. వరద నీటి ఉధృతికి ట్రాన్స్‌ఫార్మర్లు, పంపులు, ఎలక్ట్రికల్ ప్యానళ్లు దెబ్బతినడంతో ఈ పథకం మరమ్మతులకు గురైంది. దీంతో పథకం ఆయకట్టు పరిధిలోని రైతులు ఇబ్బందిపడుతున్నారు.

2465ఎకరాల ఆయకట్టు...

ఈ ఎత్తిపోతల పథకం కింద 2465.02 ఎకరాలకు ఆయకట్టు ఉంది. నాగార్జునసాగర్ ఎడమకాలువ డీవీఆర్ బ్రాంచి కాలువ పరిధిలోని మేజర్ ఆయకట్టులో పెనుగంచిప్రోలు చివరి గ్రామంగా ఉండటంతో పొలాలకు సాగునీరు సక్రమంగా అందటం లేదు. చివరి భూముల సాగునీటి కోసం మునేరులో ఐడీసీ ఆధ్వర్యంలో రూ.17.23కోట్లతో నిర్మించిన ఈ పోత్తిపోతల పథకాన్ని 2022లో ప్రారంభించారు. పంపుహౌస్‌లో 200 హెచ్‌సీ సామర్థ్యం గల నాలుగు మోటార్లు, నాలుగు పంపులు ఏర్పాటు చేశారు. నాలుగు పంపుల ద్వారా రోజుకు 30.88 క్యూసెక్కుల నీరు ఎత్తిపోసేలా ఏర్పాట్లు చేశారు. దీంతో రెండేళ్లుగా ఈ పథకం ద్వారా సుబ్బాయగూడెం, పెనుగంచిప్రోలు పొలాలకు నీరు అందుతోంది.



మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు

పంపుల్లోకి చేరిన వరదనీరు..

గత నెల మొదటి వారంలో గతంలో మునేరుకు మునుపెన్నడూ లేనివిధంగా వరదలు రావటంతో పక్కనే ఉన్న ఎత్తిపోతల పథకం నీట మునిగింది. దీంతో లోపల ఉన్న నాలుగు పంపుల్లోకి నీరు పోయి ఒండ్రు పేరుకుపోయింది. ప్యానెల్ బోర్డులు మొత్తం తడిచిపోయాయి. స్కీమ్‌కు సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు విద్యుత్‌శాఖకు చెందిన మరో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురయ్యాయి. 10విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఇలా వరదలకు ఎత్తిపోతల పథకం పూర్తిగా మరమ్మతులకు గురై పనిచేయకపోవడంతో ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకం నిర్వహణ ఖర్చులను రైతులే భరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈపథకం మరమ్మతులకు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతోందని ఆందోళన చెందుతున్నారు. వరదలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయి ఉన్నందున ఎత్తిపోతల పథకం మరమ్మతుల ఖర్చులు భరించే పరిస్థితుల్లో లేమని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల పథకానికి త్వరితగతిన మరమ్మతులు చేపట్టి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ ఎత్తిపోతల పథకం మరమ్మతుల విషయంపై ఐడీసీ ఏఈ ప్రభాకర్‌ను వివరణ కోరగా వరదలకు ఎత్తిపోతల పథకానికి భారీనష్టం వాటిల్లిందన్నారు. మరమ్మతుల కోసం రూ.7లక్షలతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశామని వివరించారు.



వరద ముంపు దెబ్బకు పనిచేయని పంపులు

రైతులు నష్టపోయి ఉన్నారు..



మాగ్రామ రైతుల పొలాలకు కూడా ఈ ఎత్తిపోతల పథకం నుంచి నీటి అవసరం ఉంది. వరదలకు పంటలు దెబ్బతిని రైతులు బాగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

–పాపినేని వెంకటేశ్వరరావు, సర్పంచ్, సుబ్బాయిగూడెం

చివరి భూములకు నీరు అందదు...



ప్రస్తుతం వచ్చే సాగర్ జలాలు కొద్దిరోజుల తర్వాత ఆయకట్టు చివరి భూములకు చేరవు. దీంతో ఆయా భూముల రైతులకు ఇబ్బందే. ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపడితే ఆయకట్టు రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

–పద్మాల నాగేశ్వరరావు, రైతు పెనుగంచిప్రోలు

నేడు కేంద్ర బృందం పర్యటన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని తక్కెళ్లపాడు, గండ్రాయి గ్రామాల్లో శనివారం కేంద్ర కమిటీ బృందం పర్యటిస్తుందని ఎంపీడీవో నితిన్ శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు తక్కెళ్లపాడు, మధ్యాహ్నం మూడు గంటలకు గండ్రాయి గ్రామాల్లో పర్యటించి, పింఛన్‌లు, హౌసింగ్, గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, గ్రామపంచాయతీ గ్రామసభల పనితీరు అంశాలపై అధ్యయనం చేస్తారని వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..మల్కాపురం గ్రామానికి చెందిన బలంతు చిట్టిబాబు(33) ఈనెల 13న తన పొలంలో కలుపు మందు పిచికారీ చేశాడు. అనంతరం చేతులు కడుక్కోకుండా కాల్వలోని నీటిని తాగాడు. దీంతో అపస్మారక స్థితికి చేరిన అతన్ని విజయవాడకు తరలించగా, చికిత్సపొందుతున్న చిట్టిబాబు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతిపత్రాలు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక శాంతినగర్‌లో అనుమతులు లేకుండా చర్చి నిర్మించి, శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్న పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానికులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, నగర అధ్యక్ష, ఉపాధ్యక్షులు సంకా భాస్కరరావు, చల్లా గణేష్, స్థానికులు కలిసి ఈ మేరకు జగ్గయ్యపేట డీటీ నాగరాజు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సీఐ జానకీరామ్, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావులను శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు.

మునగ ఆకుతో ఎన్నో ప్రయోజనాలు



మొక్కలు నాటుతున్న ఏసీడీపీవో కృష్ణకుమారి, గర్భిణులు, బాలింతలు



కంచికచర్లలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తారాబీ



ముండ్లపాడులో అవగాహన కల్పిస్తున్న ధనలక్ష్మి



జగ్గయ్యపేట 12వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 12, 14వవార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మునగ ఆకు ప్రయోజనాలపై తల్లులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డి.సీతామహాలక్ష్మి, ఎస్.లక్ష్మీకాంతమ్మ, ఆర్.అనంతలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత నివారణకు మునగ ఆకు ఎంతో దోహదపడుతుందని వివరించారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్: మునగాకులో మానవ శరీరానికి మంచిచేసే గుణాలెన్నో ఉన్నందున, ప్రతిఒక్కరూ రోజువారీ ఆహారంలో మునగ ఆకు ఉండేలా చూసుకోవాలని ఏసీడీపీవో కృష్ణకుమారి సూచించారు. మండలంలోని లింగాలపాడు, అంబారుపేట, చందాపురం, కంచల, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణీలకు మునగ, కరివేపాకుతో కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఔషధాల తయారీలో శతాబ్దాల కాలంగా మునగాకు, విత్తనాలను వినియోగిస్తున్నారని వివరించారు. అనంతరం అంగనవాడీ కేంద్రం ఆవరణలో మునగ, కరివేపాకు మొక్కలు నాటారు.కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: విటమిన్లు పుష్కలంగా ఉండే మునగ, కరివేపాకుల మిశ్రమాన్ని గర్భిణీ, బాలింతలు తప్పనిసరిగా వినియోగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ తారాబీ సూచించారు. కంచికచర్ల 12వ అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణీ, బాలింతలకు పోషక విలువలుగల ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తారాబీ మాట్లాడుతూ మునగ, కరివేపాకుల మిశ్రమ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగనవాడీ కార్యకర్తలు టి.వాణి, హెల్పర్ జ్యోతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు శుక్రవారం మునగాకుపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త జి.ధనలక్ష్మి మాట్లాడుతూ మునగాకు కూరల్లో వినియోగిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని పేర్కొన్నారు. మునగ ఆకుతో కలిగే లాభాలను బాలింతలు, గర్భిణులకు వివరించారు.

జనావాసాల మధ్య మద్యంషాపులు వద్దు : సీపీఐ

నందిగామ టౌన్: జనావాసాల మధ్యన ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తక్షణమే ఎత్తేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు శుక్రవారం డిమాండ్ చేశారు. నివాస గృహాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో మహిళలు, ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. ఇష్టారీతిన ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలు తిరుగుబాటు చేయకముందే జనావాసాల మధ్యనున్న మద్యం దుకాణాలను ఊరి చివరన ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు జర్నల్స్ ఉపయోగం

మైలవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు జర్నల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల విద్య కమిషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో యంగ్ ఇంటలెక్చువల్, ఈ జర్నల్‌ను మంగళగిరిలోని విద్య కమిషనర్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారన్నారు. ఈ జర్నల్ ప్రత్యేక సంచికతో పాటు వెబ్‌సైట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్, జర్నల్ చీఫ్ ఎడిటర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల్లో పరిశోధన పద్ధతులు అలవాటు చేయడం, వారిలో కలిగే సందేహాలను సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ ద్వారా నివృత్తి చేయడం జర్నల్ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

పసికందు వైద్యానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నెలలు నిండకుండానే పుట్టిన పసికందు వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. విద్యాధరపురం కబేళా సెంటర్‌లో నివసిస్తున్న మహేష్ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గర్భిణీగా ఉన్న అతని భార్య కనకదుర్గకు ఏడో నెలలోనే ఒక పాపకు జన్మనిచ్చింది. చిన్నారి తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతోంది. మహేష్ తన కుమార్తెకు వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేక దీవెన ఫౌండేషన్ (విజయవాడ సిటీ పోలీస్) సభ్యులను ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ గ్రూప్ సభ్యుడు కానిస్టేబుల్ నాగేంద్రబాబు శుక్రవారం హాస్పిటల్‌కు వెళ్లి చిన్నారి తల్లి దండ్రులకు రూ.10వేలు నగదును ఆర్థిక సాయంగా అందజేశారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

సీపీఎం నాయకుల నిరసన

జగ్గయ్యపేట అర్బన్: టీడీపీ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, విద్యుత్‌శాఖ ఏడీఏ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఆ పార్టీ జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా కరెంట్ చార్జీలు రూపాయి కూడ పెంచమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందని ఆరోపించారు. ట్రూ అప్ కరెంట్ చార్జీల పేరుతో రూ 8,114 కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటా కృష్ణ, కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల నరేంద్ర, షేక్ గౌస్‌మియా, బూషమ్మ, దాసరి నాగేశ్వరరావు, కె.రవికుమార్, ఎస్.రామనాథం, కె.రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ టౌన్: విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై పెనుభారం మోపడం తగదని సీపీఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటరులో శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూఆప్, సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై రూ. 8,114 కోట్ల భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో అవస్థలు పడుతున్న పేదలపై విద్యుత్ చార్జీలు భారం మరింత మోయలేనిదిగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలపై మోపుతున్న విద్యుత్‌చార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాశీం, కర్రి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, లాజర్, నారాయణ పాల్గొన్నారు.



పాత మున్సిపల్ ఆఫీసు కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



గాంధీ సెంటరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ఇసుక సరఫరా చేయాలని డిమాండ్

తిరువూరు: గత మూడు నెలలుగా ఇసుక సరఫరా లేక భవన నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఇసుక సరఫరా చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తిరువూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్డీఓ మాధురికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణంతో పాటు 18 రకాల అనుబంధ రంగాల కార్మికులు పనులు లేక పూట గడవడం కష్టంగా మారిందన్నారు. ఇసుక ధరలు సైతం విపరీతంగా పెరగడంతో నిర్మాణాలు నిలిచిపోయాయని చెప్పారు. వెంటనే ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్‌కే సుబానీ, పాలకుర్తి సునీల్, ఎస్‌కే యాకూబ్ పాల్గొన్నారు.



తిరువూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

ఇబ్రహీంపట్నం: ఏపీ జెన్‌కో సంస్థ (ఎన్టీటీపీఎస్)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షంషేర్‌వలి మాట్లాడుతూ కార్మికుల 2022 సంవత్సరం పీఆర్సీ, 16 నెలల ఎరియర్స్ తక్షణం విడుదల చేయాలని, గ్రేడ్లు మార్పుచేసి తొలగించిన ఇన్సెంటివ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రీజినల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, తంబికుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులు

- గతనెలలో వరదలకు ఏటిపట్టు గ్రామాల్లో నీటమునిగిన ఇళ్లు..
- నేటికీ బాధితులకు అందని పరిహారం
- బాధితుల ఆందోళనతో రీఎన్యుమరేషన్ చేపట్టిన అధికారులు
- అయినా నేటికీ అందని సాయం



వరదలకు కంచికచర్ల మండలం చెవిటికల్లులో నీట మునిగిన ఇల్లు(ఫైల్)



చెవిటికల్లు సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు(ఫైల్)

కంచికచర్ల : గతనెలలో సంభవించిన వరదలకు కంచికచర్ల మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరి నష్టపోయిన బాధితులు ప్రభుత్వం అందించే పరిహారం నలభై రోజులుగా కోసం ఎదురు చూస్తున్నారు. భారీవర్షాలు, వరదలకు నీరుచేరడంతో ఇళ్లలోని దుస్తులు, ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు పాడైపోయి ప్రజలు నష్టపోయారు. వరదల కారణంగా నష్టపోయిన తమకు పరిహారం అందించే విషయంలో మాత్రం రాష్ట్రప్రభుత్వం కనికరం చూపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆందోళనతో రీఎన్యుమరేషన్..

గతనెలలో కురిసిన భారీవర్షాలకు కంచికచర్ల మండలంలో ఏటిపట్టు గ్రామాలైన కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, మోగులూరు, ఎస్. అమరవరం, వేములపల్లి, పెండ్యాల, గండేపల్లి గ్రామాల్లో వరదనీరు చేరింది. చెవిటికల్లు గ్రామంలోని ఇళ్లలోకి వరదనీరు చేరడంతో నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, తహసీల్దార్ వి.జాహ్నవి తమ సిబ్బందితో నాటుపడవల సాయంతో బాధితులను చెవిటికల్లు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రానికి తరలించారు. కొత్తపేట గ్రామస్తులను కంచికచర్ల ఓసీ కళ్యాణ మండపానికి తరలించి పునరావాసం కల్పించారు. అయితే ఈ గ్రామాల ప్రజలకు నష్టపరిహారం అందించే విషయంలో మాత్రం రాష్ట్రప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో చెవిటికల్లులో బాధితులు గ్రామసచివాలయం వద్ద ఆందోళన చేసి తమకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) స్పందించి కలెక్టర్‌తో మాట్లాడటంతో ఆయా గ్రామాల్లో అధికారులు రీఎన్యుమరేషన్ నిర్వహించారు.



వేములపల్లిలో ముంపు ఇళ్లను రీఎన్యూమరేషన్ చేస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు(ఫైల్)

ఒక్క రూపాయి ఇస్తే ఒట్టు..

రీఎన్యుమరేషన్ ప్రక్రియ చేపట్టిన అధికారులు ఆయా గ్రామాల్లో ఐదువేలకుపైగా ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయని గుర్తించారు. వరదలకు ఇళ్లు నీటమునిగిన బాధితులకు నిత్యావసర సరుకులు సైతం పంపిణీ చేసిన రాష్ట్రప్రభుత్వం, బాధితులకు పరిహారం కింద మాత్రం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వరదలకు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామన్న సీఎం చంద్రబాబు హామీ సైతం నెరవేరలేదని బాధితులు వాపోతున్నారు. బాధితులను ఆదుకునే విషయంలో పాలకులు, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఏటిపట్టు గ్రామాల్లో వరద ముంపు కారణంగా నీటమునిగిన ఇళ్ల బాధితులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు తమ విద్యార్థి ఎం. లక్ష్మీనారాయణ ఎంపికయ్యారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. ఈనెల 23 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు లక్ష్మీనారాయణ ఎంపిక అయ్యారని పేర్కొన్నారు.